ప్రజాశక్తి

మంగళవారం 30 జులై 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

గాడిన పడని ఉచిత ఇసుక

- నిర్ధేశిత ధర కంటే అధిక ధరలకు విక్రయాలు
- జిల్లా అధికారులు నిర్ధేశిత టన్ను ధర రూ.250
- అదనంగా రూ.400 వసూలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో ఉచిత ఇసుక విక్రయాలు ప్రారంభమై 20 రోజులు దాటింది. తొలుత గత ప్రభుత్వ హయాంలో నిల్వ ఉంచిన ఇసుకను విక్రయించారు. ప్రస్తుతం రీచ్‌ల నుంచి ఇసుక తీయడం ప్రారంభమైంది. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నామని చెబుతున్నా 2016 నుంచి 2019 మధ్య కాలంలో లభించిన విధంగా ఇప్పుడు ఇసుక విక్రయాలపై ప్రజలు సంతృప్తికరంగా లేరు. 2019-23లో వైసిపి ప్రభుత్వ హయాంలో ఇసుక విక్రయాలు ఇష్టారాజ్యంగా నడిచారు. అప్పట్లో ఇసుక అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ధరల విషయంలో అధికారులు, వైసిపి నాయకులు చెప్పిందే వేదం అన్నట్టుగా సాగింది. దీంతో ఇసుక విక్రయాలపై అప్పటి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈనెల 8 నుంచి ఉచిత ఇసుక విధానం అమలులోకి తెచ్చారు. ఇప్పుడు ఇసుక అందుబాటులో ఉన్నా ధరలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గలేదని వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. బినామి పేర్లతో ఇసుకను బ్లాక్ చేసి ఎక్కువ మంది మారుబేరానికి విక్రయించుకుంటున్నారనే విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి. గతంలో మాదిరిగానే నిబంధనలకు విరుద్ధంగా రీచ్‌ల నుంచి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం మారినా గతంలో ఇసుక రీచ్‌ల వద్ద ఆధిపత్యం వహించిన వారే ఇప్పుడూ బినామీ పేర్లతో దందా చేస్తున్నారని చెబుతున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు వారి వాటాల

▶ 2లో

సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు

- శ్రీశైలం డ్యామ్‌కు భారీ వరద ప్రవాహం
- 3 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటి విడుదల
- 512.60 అడుగులకు చేరిన సాగర్ జలాశయ నీటిమట్టం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

కృష్ణా పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో శ్రీశైలం నుంచి సోమవారం సాయంత్రం సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 4,51,080 క్యూసెక్కుల భారీ వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. శ్రీశైలం డ్యాం మూడు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 76,056 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేపడుతూ 63,133 క్యూసెక్కులు మొత్తం 1,63,689 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల

▶ 2లో

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

వేతనాల కోసం రోడ్డెక్కిన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

- ధర్నాకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మద్దతు
- దశలవారీగా చెల్లిస్తాం : రైతు సాధికార సంస్థ సిఇఒ

వార్త మెయిన్‌లో

జిజిహెచ్‌లో అరుదైన ఆపరేషన్

- రూపాయి ఖర్చు లేకుండా రూ.25 లక్షల వైద్యం
- చిన్నారి కడుపులో కణితి తొలగింపు

వివరాలు వెల్లడిస్తున్న సూపరింటెండెంట్, ఇతర వైద్యులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో పిడియాట్రిక్ సర్జరీ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ సోమవారం వెల్లడించారు. ఇప్పటివరకు ప్రపంచంలో 100 కంటే తక్కువగా నమోదయ్యే ఇలాంటి కేసులు ఐదు లక్షల్లో ఒకటిగా ఉండే ఇలాంటి కేసుల్లో ఆసుపత్రి వైద్యులు అద్భుతంగా ఆపరేషన్ చేసి బిడ్డ ప్రాణాలను కాపాడామని ఆయన తెలిపారు. కృష్ణా జిల్లా బంటుమల్లికి చెందిన గడ్డం శోభన్‌బాబు, సుప్రియ దంపతులకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిబ్రవరి 27న బిడ్డకు జన్మనిచ్చారు. ఆ సమయంలో తల్లి సుప్రియ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ శిశువుకు ఫీట్స్ రావడంతో వైద్యులు

▶ 2లో

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : జిల్లా స్థాయి పిసిపిఎన్ డిటి అడ్వైజరీ కమిటీ సమావేశం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జరిగింది. కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ బి.రవి మాట్లాడుతూ

జిల్లాలో కొత్తగా 7 స్కాన్ సెంటర్, రెన్యువల్స్-3, మార్పుల కోసం-8 లింగ నిర్ధారణ చట్టం కింద నమోదు చేసుకున్నట్లు తెలిపారు. స్కాన్ సెంటర్ లపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. లింగ నిర్ధారణ చట్టం-1994ను సమర్థవంతంగా అమలు చేయాలని, ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 164 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద అనుమతులున్నాయని, వీరంతా చట్టం ప్రకారం అన్ని రికార్డులు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి గీతాంజలి, డిప్యూటీ డిఎంహెచ్ఓ ఎం.పద్మావతి, డిఎల్ఓ కె.మురళీకృష్ణ, డిప్యూటీ డెమో కె.సాంబశివరావు, బి.లక్ష్మణరావు, ప్రిడియాట్రిషన్ డాక్టర్ జి.గిరిరాజు, డాక్టర్ ఎ.శోభారాణి, ఎన్.బాలఅంకమ్మ బాయ్, మెడికల్ ఆఫీసర్లు జి.ధర్మసింగ్ శాస్త్రి, కెవి.ప్రవీణ్‌రెడ్డి, ఎల్.ప్రసాద్ నాయక్, ఎం.సాయి వినీత , ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు డి.శివకుమారి పాల్గొన్నారు.

గాడిన పడని ఉచిత ఇసుక

(మొదటి పేజీ తరువాయి)

కోసం వారి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమరావతి మండలం కర్లపూడి గ్రామ రెవిన్యూ అధికారి ఎ.రమేష్ నిర్లక్ష్యంగా విధులు నిర్వహించడంతో పాటు ఇసుక లారీల నుండి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలపై పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం రమేష్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరికొంత మంది అధికారులపై ఉన్నతాధికారులు, నిఘా వర్గాలు విచారణ కొనసాగిస్తున్నాయని తెలిసింది.

గతంలో మాదిరిగానే రవాణా ఛార్జీల ముసుగులో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇప్పుడు క్షేత్రస్థాయిలో కొంత మంది టిడిపి నాయకులు, అధికారులు కలిసి ప్రభుత్వ నిర్ధేశిత ధర కంటే టన్నుకు రూ.400 నుంచి రూ.500 అదనంగా వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. లోడింగ్, ఇసుక ధరతో కలిపి టన్ను రూ.250గా తొలుత అధికారులు నిర్ణయించారు. కొనుగోలు దారుల్లో ఇళ్ల నిర్మాణంలో ఉన్నవారి కంటే అవసరం లేకున్నా ఇతర మార్గాల్లో విక్రయించుకోవాలనే ఆసక్తి కలిగిన వారే ఎక్కువగా అక్రమాలకు పాల్పడుతున్నారు. 20 టన్నుల ఇసుక కొనుగోలుకు ఆధార్ కార్డు ఇస్తే సరిపోతుండటంతో ఉచిత ఇసుకలో అక్రమ విక్రయాలకు కూడా బిజం పడింది. అవసరం లేకున్నా కొనుగోలుకు ఆసక్తి చూపడం వెనుక ఇసుకను ఎక్కడికక్కడ స్థానికంగా అదనపు ధరలకు విక్రయించుకుంటున్నారు. అయితే 2014 నుంచి 2019 మధ్య కాలంలో ఇళ్లు, కట్టడాలు అవసరమైన వారికే దక్కేలా అమలు చేసిన కొన్ని ఆంక్షలు ఈసారి తొలగించారని అందువల్ల ఇప్పుడు మారుబేరంపై ఆసక్తి పెరిగిదంటున్నారు. తద్వారా ఇది మరో మాఫియాకు తెరదీసినట్టు అయ్యింది. నిబంధలకు విరుద్ధంగా ఇసుక నిల్వ చేస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. దీంతో నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం క్రమేణ పెరుగుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 512.50 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 135.7826 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కుడి కాల్వ ద్వారా 5944 క్యూసెక్కులు, ఎస్-ఎల్‌బిసి ద్వారా 800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, ఎడమ కాల్వ, లోలేవల్ కెనాల్ ద్వారా నీటి విడుదల లేదు. జలాశయం నుండి మొత్తం 6734 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పుట్టినరోజు, పెళ్లి రోజప్పుడు విద్యార్థులకు భోజనం పెట్టండి

రెంటపాళ్లలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తదితరులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి దాతలు సహకరించాలని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో శుభదిన్ భోజన కార్యక్రమంలో భాగంగా సోమవారం మధ్యాహ్న భోజన పథకానికి దాతలు ఏర్పాటు చేసిన బిర్యానీ, మిఠాయిలను విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజులు, పెళ్లి రోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేందుకు శుభదిన్ బోజన కార్యక్రమం తెచ్చినట్లు చెప్పారు. విద్యార్థులకు బిర్యానీ మిఠాయిలు, పండ్లు అందచేసిన దాత షేక్ నజీర్ అహ్మద్‌ను సత్కరించారు. ఎంఇఒలు ఎ.శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, టిడిపి నాయకులు ఎం.రామచంద్రరావు, ఎం.భాస్కర్, సిహెచ్.మోహన్‌బాబు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలి

రెంటపాళ్లలో పదోతరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు జిల్లా విద్యాశాఖాధికారికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు పణిదం వెళ్లి రాయాల్సి రావటంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కట్టమూరు, రెంటపాళ్ల జెడ్‌పి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపిస్తానని డిఇఒ హామీనిచ్చారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

శిక్షా సప్తాహ్‌లో భాగంగా 'శుభతిథి భోజన్' కార్యక్రమాన్ని స్థానిక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు బత్తాయిలు గారెలు, లడ్లు, చాక్లెట్లను దాతలు అందించారు. నిడమానూరు వెంకట్, నూతక్కి శామ్యూల్ సంకీర్త్, నక్క సుధ, నిడమానూరు హనుమంతరావు

సమకూర్చగా వీటిని 7వ వార్డు కౌన్సిలర్ చేమిటిగంటి పార్వతిదేవి అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు చెప్పారు. ఇంగ్లీష్ మీడియంతోపాటు డిజిటల్ విద్యనూ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సుధ, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎ.నీలిమ, బి.వీరాంజనేయులు నాయక్, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని 10వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు 23వ వార్డు కౌన్సిలర్, మైనార్టీ నాయకులు టి.నన్నేసా పండ్లు, ఫలహారాలు అందించారు. విద్యార్థులు చదువును ఇష్టపడి, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.కె.కరీముల్లా, ఉపాధ్యాయులు ఎం.లక్ష్మీనారాయణ, ఎన్.ఐతమ్మ, జివి.నారాయణ పాల్గొన్నారు.

అచ్యుత అర్జున్ పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు పట్టణంలోని 5వ వార్డ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, పెన్నులు పెన్సిల్ అందజేశారు. ఎంఇఒ జఫ్రూలా, హెచ్‌ఎం ప్రసాద్, సామాజిక కార్యకర్త, మాజీ కౌన్సిలర్ పివి సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు జెడ్‌పి పాఠశాలలో ఈపూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు. హెచ్‌ఎం ఎన్.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక మోడల్ స్కూలో అనంతవరానికి చెందిన టిడిపి నాయకులు డి.సాంబశివరావు కేసరి సమకూర్చారు. ప్రిన్సిపాల్ మేరీ సుజన్ పర్యవేక్షణలో విద్యార్థులకు అందించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - క్రోసూరు : బాలికలు, మహిళలకు కల్పించిన రక్షణ చట్టాలను గురించి అందరూ తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.మాధవి తెలిపారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తూరిబా పాఠశాలలో బాలికలకు రక్షణ చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. బాల్య వివాహ నిరోధక చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 181 గురించి అవగాహన కల్పించారు. పాఠశాల ప్రత్యేకాధికారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెదమక్కెనలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : మండలంలోని పెదమక్కెనలో సర్పంచ్ మందడపు అన్నపూర్ణ సాంబశివరావు పర్యవేక్షణలో సోమవారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. మురుగు కాల్వల్లో పూడికను తొలగించారు. దోమల నివారణ మందును పిచికారి చేశారు.

జిజిహెచ్‌లో అరుదైన ఆపరేషన్

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షలు చేసి ఆరోగ్యం కుదుట పడిన తర్వాత బిడ్డను తీసుకుని తండ్రి శోభన్‌బాబు ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత చిన్నారికి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించారు. కాన్పులోనే చిన్నారికి కణితి ఉందని ప్రైవేట్ వైద్యులు చెప్పారని, ఇలాంటి ఆపరేషన్ చేయాలంటే రూ.25 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. దీంతో చిన్నారి తండ్రి జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌ను కలిశారు. ఈ చిన్నారిని పిడియాట్రిక్ సర్జన్ హెచ్ఒడి డాక్టర్ భాస్కరరావు వద్ద ఈ నెల రెండో తేదీన వార్డుకు పంపించారు. బిడ్డ వయసు 4 నెలలు. డాక్టర్ భాస్కరరావు నేతృత్వంలో చిన్నారికి వివిధ పరీక్షలు చేశారు. బిడ్డ కడుపులో ఉన్న కణితికి అల్ట్రాసౌండ్ సిటీస్కాన్ పరీక్షలు చేశారు. సెంట్రిక్ సిస్ట్ ట్రీట్మెంట్ అని రిపోర్టు వచ్చింది. ఆ తర్వాత ఆపరేషన్ చేసి కణితి తీసివేశారు. ఈ కణితి పొట్ట వెనుక భాగం నుంచి కణితి వస్తుంది. రక్తనాళాలు అయోటా సుపీరియర్ వేణ కేవ, మీసెంట్రిక్ ఆర్టిరీస్, వైనిస్‌ను పెనవేసుకొని ఉన్న కణితిని తొలగించారు. ఆపరేషన్ చాలా క్లిష్టంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్‌కు నాలుగు గంటల సమయం తీసుకుందని సూపరింటెండెంట్ తెలిపారు. బిడ్డ పూర్తిగా కోలుకున్నాడని, ఆహారమూ తీసుకుంటున్నాడని తెలిపారు. రెండ్రోజుల్లో డిశ్చార్జి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పిడియాట్రిక్ సర్జరి విభాగం అధిపతి డాక్టర్ భాస్కరరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జయపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుమన్, డాక్టర్ వినోద్, పిజి వైద్య విద్యార్థులు భవేష్, పరశురామ్, కాస్యప్, సురేంద్రరెడ్డి, మత్తు వైద్యులు డాక్టర్ క్రిస్టాఫర్ పాల్గొన్నారు.

వచ్చే ఐదేళ్లలో ఎక్కువ నిధులు కేటాయించాలి

పార్లమెంట్‌లో టిడిపి పార్లమెంటరీ నేత శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి ఎంతో దెబ్బతిన్న ఏపీని పునర్నిర్మించాలంటే ఎక్కువ సహకారం అవసరం ఉందని, వచ్చే ఐదేళ్లలో ఎక్కువ నిధులు కేటాయించాలని పార్లమెంటులో టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. 2013లో రాష్ట్ర విభజన నాటి నుండి రాష్ట్రం కోలుకోలేని పరిస్థితిలో ఉందని, ప్రస్తుతం అప్పుల్లో కూరుకుపోయిందని చెప్పారు. విభజన చట్టాన్ని తయారు చేసిన కాంగ్రెస్ ఏపీకి చట్టంలో ఇచ్చిన హామీల గురించి మర్చిపోయి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. విభజన చట్టంలోని హామీల ప్రకారమే నిర్మలా సీతారామన్ అమరావతి, పోలవరానికి నిధులు కేటాయించారన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 94లోనే అమరావతి నిర్మాణానికి కేంద్రం ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలని, సెక్షన్ 19లో పోలవరం నిర్మాణం బాధ్యత కేంద్రానిదేనని గుర్తు చేశారు. పారిశ్రామికాభివద్ధికి సెక్షన్ 94(1), వెనుకబడిన జిల్లాల అభివద్ధికి సెక్షన్ 94(2) ప్రకారం నిధులు కేటాయించాలని విభజన చట్టంలోనే పేర్కొన్న విషయాన్ని ప్రతిపక్షాలు విస్మరించడం తగదన్నారు. రాష్ట్రం పారిశ్రామికంగా వెనకబడిపోయిన నేపథ్యంలో ఎక్కువ నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనక బండి ప్రాంతాలు అభివృద్ధి కూడా విభజన హామీలు ఉన్నదేనని చెప్పారు. రాష్ట్ర విభజన అనంతరం మొదటి అసెంబ్లీ సమావేశాలు నాటికి రూ.24 వేల కోట్ల ఆర్థిక లోటుంటే ఇప్పుడు రూ.9.74 లక్షల కోట్లు అయిందని తెలిపారు. గత ప్రభుత్వం అప్పులు తెచ్చి అనవసర ఖర్చులు పెట్టిందన్నారు.

విద్యార్థులతో సహపంక్తి భోజనాలు అభినందనీయం

ముగిసిని శిక్షా సప్తాహ్ కార్యక్రమం - పలు పాఠశాలల్లో మిఠాయిలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ ఉర్దూ బాలికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాశరావు, జైన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ మున్ను సౌజన్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో స్వీట్, ఖీర్ అందించారు.పాఠశాల విద్యాశాఖ ఏడీ ఎస్.నిర్మలరాణి విద్యార్థులకు తిథి భోజనం అందించిన దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎండి.ఖాసిం, మధ్యాహ్న భోజన పర్యవేక్షకులు సాంబశివరావు, కార్యాలయ సిబ్బంది మాధవి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం రాబియా బసిరి, పాఠశాల కమిటీ ఛైర్మన్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పొన్నూరు

విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులతో సహపంక్తి భోజనాలు చేయటం సంతోషదాయకమని టిడిపి సీనియర్ నేత, 24 వ వార్డు మాజీ కౌన్సిలర్ అలపర్తి చంద్రమోహన్ అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులతో వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, స్థానిక నాయకులతో కలసి పీఎం రోషన్ లో భాగంగా పొన్నూరు శ్రీరామ మున్సిపల్ హై స్కూలు ప్రాంగణంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం "సహ పంక్తి భోజనాలు" ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు స్థానిక శ్రీరామ మున్సిపల్ హై స్కూల్ హెడ్మాస్టర్ కాకుమాను లాజర్ బాబు అధ్యక్షత వహించారు. సభలో అలపర్తి చంద్రమోహన్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. సభలో 25వ వార్డ్ మాజీ కౌన్సిలర్ షేక్ సిలార్ భాష మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహారం అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనం అందించడం ప్రశంసనీయమన్నారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ కరీముల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జనసేన పార్టీ చీఫ్, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మధ్యాహ్న భోజన పథకానికి సేవా నిరతి గల డొక్కా సీతమ్మ పేరును సూచించి నామకరణం చేయటం ఆమె కీర్తి ప్రతిష్టలను చాటటమే అన్నారు. ఈ సందర్భంగా క్రీడా దినోత్సవం పురస్కరించుకొని కబడ్డీ, కోకో, మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీ నిర్వహించి విజేతలకు అలపర్తి చంద్రమోహన్, తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కాకుమాను లాజర్ బాబు, కూటమి నాయకులు ఎరసాని నాగభూషణం, అప్పారావు, షేక్ లియాకత్, గురుబాలు, డొక్కా రమాదేవి, అమానుల్లా, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ శాంతి, తాళ్లూరి అప్పారావు, దేశం శెట్టి సూర్య, ఆకుల గోపి, షేక్ అజంతుల్లా, సొంగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పడవల మహేష్ ఆర్థిక సహకారంతో రత్నాలచెరువులో ఉన్న బిఎన్ఆర్ మున్సిపల్ పాఠశాలలో సోమవారం టీడీపీ నాయకులు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో జులై 22 నుండి 29వ తేదీ వరకు వారం రోజుల పాటు 'శిక్షా సప్తాహ్'(విద్యావారం) కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా టీడీపీ నాయకులు విద్యార్థిలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు ఏడుకొండలు, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, గుంటూరు పార్లమెంటరీ సగర సాధికార సమితి కన్వీనర్ పందేటి తిరుపతయ్య, 21వ వార్డు అధ్యక్షులు వంగర రమేష్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ కాలనీ లోని మున్సిపల్ పాఠశాలలో శుభదిన్ భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల పిల్లలతో కలిసి ఉపాధ్యాయులు సహా పంక్తి భోజనం చేశారు.ఆయా కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటిరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో అంకారావు మాస్టర్, న్యాయవాది పాలకాయలు వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రత్తిపాడు : మండల పరిధిలోని ఎంపీపీ ఎస్ రాయపాటి వారి పాలెంలో హెచ్ ఎం జి రవికుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. తిథ్ భోజనం లో బాగంగా వి ద్యార్థులకు భో జనాల ను గింజుపల్లి శివరాం ప్రసాద్ అందించారు. ఈ సందర్భ ంగ గ్రామ పెద్దలు తల్లిదండ్రులు తీద్ బోజనం అంది ంచిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

గుంటూరులో విద్యార్థులకు ఖీర్, లడ్డు అందచేస్తున్న విద్యాశాఖ ఏడీ, తదితరులు

మంగళగిరిలో

చేబ్రోలులో

ప్రజాశక్తి చేబ్రోలు : సుద్దపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాశాలలలో శిక్ష సప్తాహ్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయని మండల విద్యాశాఖధికారి రాయల సుబ్బారావు తెలిపారు. శుభదిన్ భోజన్ కోసం దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం తో పాటు అదనపు ఆహారము అందించడం జరిగిందని తెలిపారు. దీనిని ఆరోజు సాధారణ మెనూ తో పాటుగా స్వీట్ కానీ, ఫ్రూట్ కానీ, పెరుగు కానీ, మజ్జిగ కానీ , దాతల సహకా రంతో ఇవ్వవచ్చునని తెలిపిన దాని ప్రకారం విద్యార్థులకు ఈ సదుపాయాన్ని కల్పించడం జరిగిందని తెలిపారు. సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ సభ్యులు మరియు మండల విద్యాశాఖ అధికారి విద్యార్థులతో పాటు పాఠశాలలో శుభదిన్ భోజన్ మధ్యాహ్న భోజనమును పాఠశాల విద్యార్థులతో కలిసి తిన్నారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన దాత నారి శెట్టి మణికంఠకు విద్యాశాఖ అధికారి ఆర్ సుబ్బారావు,ఉపాధ్యాయులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు పార్ధసారధి , చైర్మన్ గోపి , తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, దాతలు నారిశెట్టి మణికంఠ , ,మిడ్ డే మీల్స్ ఏజెన్సీ అందరి సహ కారంతో మంచిగా నిర్వహించడం జరిగిందని ఉపాధ్యా యులు, ఎంఈ ఓ లు అందరికి అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : స్థానిక జడ్పీ పాఠశాలలో శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం శుభ తిథి బోజన్ లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ సోమవారం స్థానిక జడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థి దాత డాక్టర్ సి. కోదండరామయ్య సహకారంతో 242 మంది విద్యార్థులకు ప్రత్యేకంగా స్వీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ దుర్గ. పూర్వ విద్యార్థులు రావి శివరామకష్ణయ్య. మల్లంపాటి అమ్మయ్య . పెద్ది సుబ్బారావు. గుంటుపల్లి అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

In The Court of the Hon'ble Additional Senior Civil Judge of Tirupati
I.P.No.28/2023
G.Rajani Kumar & Kumar ...Petitioner
V/s
Chandra Sekhar Narvaneni & 5 others ...Respondents
I.P.NOTICE TO RESPONDENT NO.2
R2) L.Gopi S/o L.Venkateswara Rao, R/o D.No.11-356, 11-301 to 11th Block, Mangalagiri, Pedavadlapudi Village, Mangalagiri Mandal, Guntur District.
Please take I.P. Notice in the above case, the case is posted to 16.08.2024 of I.P. Notice and for your appearance i.e., Respondent No.2 before this Hon'ble court. Please be present on **16.08.2024** on 10.30 A.M., Otherwise, the matter/case will be decide as exparty.
VELLORE G.GANESH
Advocate, Tirupati. Cell: 9849144819

వేలం ప్రకటన
IN THE COURT OF THE IV ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION):: GUNTUR
E.P.No. 8 / 2020 in OS No. 210 / 2018
Between:
Choppavarapu Venkateswarlu ....DHR
And
Shaik Fathimoon & Others ....JDR's
పైనెంబరు ఇ.పి.లో ఇస్తిహారు జారీకాబడి జప్తు ఖాయమైన జె.డి.ఆర్స్ తాలూక ఆస్తిని వేలంవేయు టకు శ్రీ కోర్టు వారు ది.20-08-2024వ తేదికి వాయిదావేసినారు. కావున వేలం పాటలో పాల్గొన దలచినవారు వాయిదారోజున ఉ॥గం॥10-30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును. కోర్టు వారి షరతులకు లోబడి వేలం పాట జరుగును.
Schedule: Guntur Dt., Guntur Sub.Dt. Guntur Municipal Corporation Area, Lalapet, Old Ward No.8, New Ward No.9, Plot No.3, T.S.No.224, Door No.18-8-21, Assessment No.16860, eastern side extent of 65sq.yards of site with RCC building built there with three rooms out of Ac.0.05 cents being bounded by:**East:**Property belongs to Shaik Naseer Ahammed, **South:**Property belongs to Shaik Babu,**West:** Municipal Road, **North:**Property belongs to Challa Prasanna Lakshmi and others. Within the above boundaries an extent of 65 sq.yards of site including RCC building with 3 rooms with all appurianances, fixtures and fittings thereon.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
డి. హెచ్.ఆర్ విలువ రూ. 10,00,000/-
అమీనా విలువ రూ. 20,00,000/-
వేలం వాయిదా ది. 20-08-2024
ఫర్దర్ హియరింగ్ ది. 04-09-2024.
డి. నాగబాబు, డి.హెచ్.ఆర్ .తరపు న్యాయవాది , గుంటూరు, సెల్: 9440759153

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE COURT NARASARAOPET
Creditor Insolvency Petition No. 29/2024
Between :
1) Tanikonda Srihari Rao
2) Kalli Basivireddy
3) Padala Nagi Reddy
4) Jettiboina Venkata Subbaiah ....Petitioners
and
1) Nambula Sambasiva Rao @ Samba
2) Virla Venkateswara Rao...Respondents
పై నెంబరు ఐ.పి. దావాలో పిటీషనర్స్ ఇందలి రెస్పాండెంట్స్‌పై క్రెడిటార్ ఐ.పి. దాఖలు చేసి సదరు పిటీషనర్స్‌కు రావలసిన బాకీ 1వ ప్రతివాది నుండి రాబట్టుకొనుటకు దాఖలు చేసియున్నారు. సదరు ఐ.పి.పై ఎవరికైనా అక్షేపణలు వున్న యెడల పై కోర్టువారి ఎదుట ది. 30-8-2024న ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీకు గల అక్షేపణలు తెలియ పరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడ మైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 30-8-2024
ఇట్లు
కె.బుచ్చిదంతాచారి
న్యాయవాది, నరసరావుపేట.
సెల్ : 94416 55377

విత్తన దుకాణాల్లో వ్యవసాయ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విత్తన దుకాణదారులు వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నిబంధనలను అతిక్రమించిన గుర్తింపు లేని నకిలీ విత్తనాలు విక్రయించిన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సును రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ రవికుమార్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో గల పలు విత్తన దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దుకాణదారుడు తప్పనిసరిగా ఆయా విత్తన కంపెనీల విక్రయ అనుమతి పత్రం తనిఖీ అధికారులు వచ్చినప్పుడు చూపించాల్సి ఉంటుందని సూచించారు. అదేవిధంగా ఆయా విత్తన కంపెనీ పరిమాణం, ధర కాలం చెల్లే సమయం, నిల్వల వివరాలు తప్పనిసరిగా దుకాణంలో ఏర్పాటు చేసిన బోర్డులో ప్రదర్శించాలని రికార్డులు నమోదు చేయాలని రికార్డుల వివరాలకు బోర్డుపై నమోదు చేసిన వివరాలకు దుకాణంలో ఉన్న నిల్వలకు ఏమైనా వ్యత్యాసం ఉంటే ఆ విత్తనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి మస్తానమ్మ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తరచు విత్తన దుకాణాలను రవాణా శాఖ కార్యాలయాలలో విస్తత తనిఖీలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లును,విత్తన సంచి వంటకాలు ముగిసే వరకు భద్రపరచాలని సూచించారు. గుర్తింపు పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.

గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-తెనాలి : పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతం గ్రాండ్ హోటల్ పక్క రోడ్డులో పాడుబడిన డాల్‌మిల్ సందులో షుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసుగల యువకుడు మృతి చెంది ఉన్నాడు. ఒంటిపై కాఫీకలర్ గళ్ళ చొక్కా, బ్లూకలర్ జీన్స్ ప్యాంట్, బెల్ట్ ధరించి ఉన్నాడని, ఎత్తు 5.7 అడుగులు ఉండవచ్చునని, ఎడమచేతి చిన్న వేలుకు సాయిబాబా ఉంగరం, వాచి ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. మృతుని ఆనవాళ్లు గుర్తించిన వారు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించా ల్సిందిగా కోరారు.

వన్యప్రాణి 'అలుగు'ను వేటాడి విక్రయిస్తున్నారనే

అనుమానంతో యువకుల అరెస్టు

ఆగ్రహించిన యువకుల బంధువులు - అధికారులపై రాళ్లతో దాడి

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, గోట్టిపాళ్ళ సమీపంలో వన్యప్రాణులను ఆక్రమంగా తరలిస్తున్నారన్న అనుమానంతో నిందితులను తీసుకొస్తున్న అటవీశాఖ అధికారులపై నిందితుని బంధువులు రాళ్ళతో దాడి చేసిన సంఘటన సోమవారం జరిగింది. విజయపురిసౌత్ వన్యప్రాణి అటవీశాఖ పరిధిలోని, శిరిగిరిపాడు బీట్‌లో అలుగు వన్యప్రాణులను వేటాడుతున్నారన్న సంగతి తెలుసుకోని అటవీశాఖ అధికారులు ఇటీవల నిఘా పెంచారు. అలుగు జాతి జంతువుకు ప్రపంచ మార్కెట్‌లో బాగ డిమాండ్ ఉన్నదని, విదేశీయులు రూ 70 నుండి 80లక్షలతో ఈ జంతువును కొనుగోలు చేస్తున్నారని ప్రచారం ఉండటంతో సదరు జంతువుల ఉనికికి ప్రమాదం ఏర్పడింది. వాటిని కాపాడేందుకు అటవీశాఖ అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. గోట్టిపాళ్ళ గ్రామ సమీపంలోని కొందరు వ్యక్తులు కొద్ది రోజుల క్రితం అలుగు జంతువును వేటాడి అమ్మకానికి ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుసుకోని, సదరు గ్రామంపై దాడి చేసిన అధికారులు ఆదివారం తెల్లవారుజామున ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోన్నారు. మరో ప్రధాన నిందితుడు హనుమాపురంతండాకు చెందిన గోవిందనాయక్ గోట్టిపాళ్ళ సమీపంలోనే దాక్కున్నాడని తెలిసి అతనిని పట్టుకునేందుకు వెళ్ళి దాడి చేసి పట్టుకున్నారు. గోవిందనాయక్‌ను జీపులో ఎక్కించుకోని వస్తుండగా, మార్గమధ్యలో అతని బంధువులు దారికాసి రాళ్ళతో దాడి చేశారు. గోవిందనాయక్‌ను లాక్కోని వెళ్ళేందుకు ప్రయత్నించారు. హనుమాపురంతండాకు చెందిన రవినాయక్, రావుల కొండలు మరి కొందరు మహిళలు తమపై దాడి చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. దాడిలో విపిసౌత్ రేంజి అధికారి టి సత్యనారాయణరెడ్డి, శిరిగిరిపాడు బీట్‌కు చెందిన సిబ్బంది మహేష్‌బాబుకు గాయాలైనాయి. దాడి ఘటనపై అటవీశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అదుపులో ఉన్న ముగ్గురు నిందితులను అటవీశాఖ అధికారులు సోమవారం కోర్టుకు హాజరుపర్చారు. సోమవారం అదుపులోకి తీసుకోన్న గోవిందనాయక్‌ను మంగళవారం కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

నేడు 'సంఘం శరణం గచ్ఛామి' నృత్య రూపక ప్రదర్శన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్ భువనచంద్ర టౌన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరివాడని కొనియాడుతూ ఆయన జీవిత చరిత్రను, భారత రాజ్యాంగం రచించేందుకు చేసిన కృషిని వివరిస్తూ నాటక ప్రదర్శన ఉంటుందని ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో 600లకు పైగా అద్భుతమైన ప్రదర్శన విజయవంతంగా ఇచ్చిన హైదరాబాద్ అభ్యుదయ అకాడమీ ఆధ్వర్యంలో 'సంఘం శరణం గచ్ఛామి' అనే నృత్య రూప నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు.

ప్రకటనలకే పరిమితమైన ఉచిత ఇసుక : జనసేన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు చేస్తుండగా వైసిపికి చెందిన ఇసుక అక్రమార్కులు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కో-కన్వీనర్ పి.బాలాజి ఆరోపించారు. స్థానిక పండరీపురంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఐదేళ్లపాటు ఇష్టారీతిన అక్రమాలకు పాల్పడిన ఇసుకాసురులు కొత్త ప్రభుత్వంలోనూ ఇసుక దందా కొనసాగిస్తున్నారని, దీంతో ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం ప్రకటనలకే పరిమితమైందని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే లోడింగ్, రవాణా ఛార్జీలు వసూలు చేయాలని అన్నారు. కూలీలకు పుష్కలంగా పనులుండాలని మార్గనిర్ధేశం చేసినా కిందిస్థాయి అధికారులు, సిబ్బందిలో మార్పు రాలేదని విమర్శించారు. వైపిపి హయాంలో ఇసుక మాఫియాలో పాలుపంచుకున్న వారు ప్రస్తుతం రీచ్‌ల్లో తిష్ఠ వేసి ఇసుక దందా కొనసాగిస్తున్నారని అన్నారు.

మధ్యాహ్న భోజన తనిఖీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని గారపాడు జెడ్‌పి పాఠశాలను ఎంఇఒ-2 సత్యనారాయణ సోమవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతోపాటు హాజరుపట్టి, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. మెనూ తప్పనిసరిగా పాటించాలని, పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివనాగేశ్వరరావు, పెరుగన్నం దాత మక్కెన సాగర్, సర్పంచ్ ఎం.రమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం తాళ్లపల్లిలోని ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ పసుపులేటి బ్రహ్మానాయుడు సోమవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసి నాణ్యతపై విద్యార్థులతో మాట్లాడారు. గ్రామ చెరువు అక్రమణలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకట్రామయ్య సర్వేయర్, విఆర్వో, నాయకులు బి.సత్యనారాయణ, అమర్, నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఆంజనేయులు, వెంకటేష్ నాయక్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

40 మంది మహిళల వద్ద రూ.18 లక్షల మోసం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వివిధ ప్రభుత్వ శాఖల్లోని సమస్యలను అధిగమించి, ప్రగతిని సాధించాలని జిల్లా అధికారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు దిశానిర్దేశం చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్ అధ్యక్షత వహించారు. ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్‌తోపాటు జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, ఐసిడిఎస్ పీడీ ఉమారాణి వివిధ శాఖల జిల్లా అధికారులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు శ్రద్ధ, అంకిత భావంతో పనిచేసి జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలన్నారు. నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, జిల్లాలో దృష్టి సారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని పనులు చేపట్టాలన్నారు. మండలాల ప్రత్యేకాధికారులు వారానికి ఒక్కరోజు సచివాలయాలు, పాఠశాలలు, హాస్టల్లో, రైతుసేవా కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రులను తనిఖీలు చేసి, అక్కడ సమస్యలను పరిష్కరించాలన్నారు. శాఖలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అంశాలను సమీక్షించుకోవాలని సూచించారు.

టిడిపి అభిమానినని పింఛను ఆపారు

టిడిపి సానుభూతిపరుడినని 2019లో వైసిపి గ్రామ నాయకులు తనకు సామాజిక పింఛనును అన్యాయంగా నిలిపేశారని, అప్పట్లో 63 ఏళ్లున్న తాను తనకు అన్యాయం జరిగిందని అధికారుల చుట్టూ తిరిగినా కరుణించలేదని మండల కేంద్రమైన కారంపూడికి చెందిన బాణావత్ బాలునాయక్ ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం 68 ఏళ్ల వయసులో వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నానని, పింఛను మంజూరు చేయాలని కోరారు.

దారివ్వకపోతే పొలం బీడే

1981లో కొనుగోలు చేసి అనుభవిస్తున్న 2.03 ఎకరాల పొలానికి వెళ్లేందుకు డొంకరోడ్డు నుండి 2 ఎకరాలు దాటి వెళ్లాల్సి ఉంటుందని, ఇటీవల పై వైపు భూమి కలిగిన కొరారి భూపతి తన పొలం మీదుగా వెళ్లేందుకు వీలు లేదని దౌర్జన్యం చేస్తున్నారని, 50 ఏళ్ల క్రితం ఉన్న రికార్డుల ప్రకారం తన పొలంలోకి వెళ్లేందుకు అరక బాట ఉన్నా వారు దౌర్జన్యం చేస్తున్నారని క్రోసూరు మండలం బయ్యారానికి చెందిన పూజల వెంకట్రావు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి తహశీల్దార్, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, తమకు ఆ భూమే ఆధారమని, న్యాయం చేయాలని వేడుకున్నారు.

తపాలా శాఖ ఉద్యోగి మోసంపై ఫిర్యాదు..

మాచర్ల మండలం కంభంపాడు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా పని చేసిన నరసరావుపేట మండలం ఇస్సపాలేనికి చెందిన పాలడుగు వెంకట కార్తీక్ సుమారు 40 మంది మహిళలతో రూ.18 లక్షల మేర పోస్ట్ ఆఫీస్‌లో డిపాజిట్ పేరిట నగదు వసూలు చేసి అవి తన సొంత అవసరాలకు వినియోగించుకున్నారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు సస్పెండ్ చేసినా తమకు న్యాయం జరగలేదని కంభంపాడుకు చెందిన పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.

యానిమేటర్లకు టిడిపి వారే జీతాలిస్తున్నట్లు..

డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇప్పించడంలో, తిరిగి సకాలంలో బ్యాంకులకు చెల్లించడంలో కీలక పాత్ర పోషిస్తున్న యానిమేటర్లపై రాజకీయ వేధింపులు తగదని సిఐటియు అమరావతి మండల కార్యదర్శి సూరిబాబు అన్నారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అమరావతి మండలం యండ్రాయి, చావపాడు, వైకుంఠపురం గ్రామాల్లో ఎస్సీలైన పలువురు యానిమేటర్లు న్యాయం చేయాలని సిఐటియుని ఆశ్రయించారని తెలిపారు. స్థానిక టిడిపి నాయకులు యానిమేటర్లకు తామే వేతనాలు ఇస్తున్నట్లుగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, దీనిపై విచారణ జరిపి యానిమేటర్లను కొనసాగించాలని కోరారు.

విద్యుత్ అధికారుల వారి నిర్లక్ష్యం నా చావుకొచ్చింది

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం నా ప్రాణం మీదకు వచ్చిందని, శరీరం మొత్తం కాలి తీవ్ర గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డానని, తనకు నష్టపరిహారం చెల్లించాలని బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడుకు చెందిన వాంకడవత్ కృష్ణ నాయక్ ఫిర్యాదు చేశారు. తన పొలంలో వ్యవసాయ మోటార్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు పోవడంతో విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా ప్రస్తుతం సిబ్బంది అందుబాటులో లేరని, విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఫ్యూజు వేసుకోవాలని సూచించారని, విద్యుత్ సరఫరా నిలిపివేశారని నిర్ధారించుకున్న అనంతరం ఫ్యూజు వేస్తుండగా విద్యుత్ సరఫరా ప్రారంభించడంతో విద్యుత్ షాక్‌కు గురై శరీరం మొత్తం కాలిపోయిందని తెలిపారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఫిర్యాదు చేశారు.

టిడిపిలో చేరిన కౌన్సిలర్లు, కౌన్సిలర్ల భర్తలు

ప్రజాశక్తి-మాచర్ల

వైసిపి కౌన్సిలర్లు పలువురు సోమవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఇద్దరు కౌన్సిలర్లు మరో ఆరుగురి కౌన్సిలర్ల భర్తలకు బ్రహ్మారెడ్డి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాచర్ల మున్సిపాల్టీని సమిష్టిగా అభివృద్ధి చేద్దామన్నారు. పార్టీలో చేరిన వారిలో 8వ వార్డు కౌన్సిలర్ గెల్లిపోగు జగన్‌మోహన్‌రెడ్డి, 9వ వార్డు జగన్నాథం శివయ్యతో పాటు 10వ వార్డు కౌన్సిలర్ సిద్ధమ్మ భర్త సిద్ధయ్య, 2వ వార్డు కౌన్సిలర్ షేక్ జాన్‌బీ భర్త నాగుల్‌మీరా, 5వ వార్డు కౌన్సిలర్ కలివెల జ్యోతి భర్త కిషోర్, 7వ వార్డు రామగాని రమణి భర్త శంకర్, 11వ వార్డు కౌన్సిలర్ బుట్టి శ్యామలజ్యోతి భర్త చంద్ర, 24వ వార్డు కౌన్సిలర్ తాళ్ల గోవర్ధని మామ కొండలు ఉన్నారు. కార్యక్రమంలో ఎన్నికలకు ముందే టిడిపిలో చేరిన కౌన్సిలర్ మదార్ సాహెబ్ తదితరులు ఉన్నారు. తాజా చేరికలతో మాచర్ల మున్సిపాలిటీలో 30 కౌన్సిలర్ల బలం ఉన్న వైసిపి 20కి పడిపోగా, ఒక్క కౌన్సిలర్ కూడా లేని టిడిపి బలం 10కి పెరిగింది.

రోజు మార్చి రోజు తాగునీరు

- తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.159 కోట్లతో పథకాన్ని పూర్తి చేస్తాం
- మూడు సింగర చెరువుల పరిశీలనలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

చెరువులో నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణానికి తాగునీరు సరఫరా చేసే 3 సింగర చెరువులను సాగర్ జలాలతో నింపామని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా కోసం ఫిల్టర్ బెడ్లను మార్చామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చెప్పారు. మున్సిపల్ అధికారులతో కలిసి చెరువులను సోమవారం పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు ప్రజలు తాగునీట ఇబ్బందులను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగానే స్పందించారని, నాగార్జునసాగర్ డ్యాం డెడ్ స్టోరేజ్‌లో ఉన్నా కుడి కాల్వకు తాగునీటిని విడుదల చేయించారని చెప్పారు. జలాలు విడుదలకు ఇరిగేషన్, మున్సిపల్ శాఖల మంత్రులు రామానాయుడు, నారాయణ చొరవ అభినందనీయమన్నారు. తాగునీటిని రోజుమార్చి రోజు సరఫరా చేస్తారని, ప్రజలు వృథా చేయకుండా వాడుకోవాలని కోరారు. పట్టణానికి శాశ్వతంగా తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని, రూ.159 కోట్లతో పథకాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మక్కన మల్లికార్జునరావు మాట్లాడుతూ చెరువులో నీటి మట్టం తగ్గగానే ఎమ్మెల్యే సందర్శించి సిఎం, మంత్రులను సంప్రదించి జలాలు విడుదల చేయించారని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ నీరు నింపారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, డిఈ వెంకయ్య, టిడిపి నాయకులు పఠాన్ అయూబ్‌ఖాన్, పీవీ సురేష్‌బాబు, పి.పూర్ణచంద్రరావు, వి.పెరయ్య, పి.కృష్ణ, ఎం.నసరయ్య పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలి

వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. విజయసాయిరెడ్డి నోరు తెరిస్తే అన్ని అసత్యాలు, అబద్ధాలు, గ్లోబల్ ప్రచారాలు చేయటం సిగ్గుచేటని, ఆయన ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టిటిడి చైర్మన్‌లుగా వైవి సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, జవహర్‌రెడ్డి ఇలా ఒకే సామాజిక తరగతి వారిని పెట్టారని, అయితే వివిధ కీలక పదవుల్లో అన్ని సామాజిక తరగతుల వారిని చంద్రబాబు నియమిస్తుంటే విజయసాయిరెడ్డి ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఇదిలా ఉండగా సంక్షేమ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం సంతోషకమంటూ సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో అన్ని సంక్షేమ పథకాలకు జగనన్న పేరు పెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. 1వ తేదీ పింఛనును సచివాలయ ఉద్యోగులు లబ్ధిదార్ల ఇళ్ల వద్దకే వచ్చి ఇస్తారని, చెప్పారు.

ఇసుక సరఫరా సక్రమంగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం వినియోగదారులకు ఉచితంగా అందిస్తున్న ఇసుకను స్టాక్ పాయింట్ల నుండి సక్రమంగా సరఫరా అయ్యే విధంగా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధ్యక్షతన, జేసీ ఏ.భార్గవ్ తేజతో కలసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధలకు విరుద్ధంగా ఇసుక సరఫరా, నిల్వ చేయకుండా, ఎక్కువ ధరకు విక్రయించకుండా అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని, తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక సరఫరాపై వచ్చిన ఫిర్యాదులను ప్రత్యేక దష్టిపెట్టి పరిష్కరించాలన్నారు. తుళ్ళూరు మండలంలోని తాళ్లాయపాలెం, లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా రోడ్డు వేయడానికి రూ.13 లక్షలతో పంచాయితీ రాజ్ ఎస్ఈ ద్వారా పనులు చేపట్టేందుకు సమావేశంలో నిర్ణయించారు. తుళ్ళూరు మండలం, బోరుపాలెం వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే మైన్స్ అండ్ జియాలజీ శాఖ ఇసుక త్రవ్వకాలకు గుర్తించిన కొల్లిపర మండలంలోని బొమ్మువానిపాలెం, పిడపర్తివారిపాలెం, వల్లభాపురం, అత్తలూరివారిపాలెం, దుగ్గిరాల మండలంలోని పెదకొండూరు వద్ద వున్న రీచ్‌లను పది రోజులలోపు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. మున్నంగి, తాళ్లాయపాలెం, లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఇంటర్నెట్, సీసీ టీవిల ఏర్పాటుకు విద్యుచ్ఛక్తి సరఫరా అవసరం అయివున్నందున అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఇసుక సరఫరా చేసే వాహనాలకు జిల్లా రవాణా శాఖ నిర్దేశించిన ధరలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ధరల వివరాలను ప్రతి స్టాక్‌యార్డులో ఫ్లెక్సీలు ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, టన్నుకు కేవలం రూ.250లు, లోడింగ్ ఖర్చులు మాత్రమే వినియోగదారులు చెల్లింపు చేయాల్సిన అంశాన్ని ఫ్లెక్సీలో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో శ్రీకర్, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్. కరీం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో కీటక జనిత, కలుషిత నీటికారక వ్యాధులు, సీజనల్ వ్యాధుల నివారణ, వ్యాప్తిని అరికట్టేందుకు వైద్యారోగ్య, పంచాయితీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ ఏ.భార్గవ్ తేజతో కలసి సీజనల్ వ్యాధులు, మధ్యాహ్న భోజన పథకం, సీసీఆర్సీ కార్డుల మంజూరు, సుమోటో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ల మంజూరు, ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం, ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ అంశాలపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీజనల్ శ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచటంతో పాటు, ప్రతి ఒక్కరు మధ్యహ్న భోజనం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు పంట రుణాలతో పాటు ప్రభుత్వం అందించే ఇతర రాయితీల అమలు కోసం సీసీఆర్సీ కార్డులు నిర్దేశించిన మేరకు మంజూరు అయ్యేలా వ్యవసాయశాఖ అధికారులను సమన్వయం చేసుకొని రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, పీడీ డిఆర్డీఏ హరిహరనాథ్ , సీపీఓ శేషశ్రీ, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ, డీఈఓ శైలజ, వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొత్త స్కూటలర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

నవతరానికి సుజుకి అవెనిస్ అనువైనది : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నవభారత్ నగర్ బ్రాంచ్‌లో సుజుకి అవెనిస్ 125 సిసి స్కూటర్‌ను గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ల మాధవి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సరిపూడి సుజుకి అధినేత సరిపూడి అనిల్‌కుమార్, యస్‌యంఐపిఎల్ ఆర్ఎం శివరామకృష్ణ, సర్వీసు ఆర్ఎం సునీల్, ఎఆర్ఎం బాలకృష్ణ, సిఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టూవీలర్ రంగంలో ప్రఖ్యాతి గాంచిన జపాన్‌కు చెందిన సుజుకీ సంస్థ తన కొత్త స్కూట్ అవెనిస్‌ను మార్కెట్‌లోకి తేవటం అభినందనీయం అన్నారు. సరిపూడి అనిల్‌కుమార్ మాట్లాడుతూ సుజుకి అవెనిస్ 125 సిసి స్కూటర్ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగి, డ్రైవింగ్‌కు ఎంతో సులువైనదని, నాణ్యతలో సాటిలేదని, 10 సంవత్సరాల వారంటీతో కష్టమర్లకు అందిస్తున్నట్లు చెప్పారు.

డిఎంహెచ్ఒ ఆఫీసు వద్ద నిరసన తెలియజేస్తున్న హెల్త్ సెక్రెటరీలు

హెల్త్ సెక్రటరీలను కించపరిచే వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

సామాజిక పింఛన్ల కార్యక్రమంలో గ్రామ వార్డు హెల్త్ సెక్రటరీలను భాగస్వామ్యం చేయడంలో భాగంగా గుంటూరు జిల్లాలోని ఒక మహిళా అధికారి హెల్త్ సెక్రటరీలను ఉద్దేశించి 'నాటకాలు ఆడుతున్నారని' ,"వాళ్ల చేసే పని ఆగిపోతే కొంప మునిగిపోయేదేమీ లేదని', ఇతరత్రా వ్యాఖ్యలు చేస్తూ కించపరచడాన్ని ఖండిస్తూ ఏపీ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అధికారులు అత్యుత్సాహంతో కింది స్థాయి సిబ్బందిని, వారు చేస్తున్న కషిని గుర్తించకపోగా, కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని నాయకులు అన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల సర్వేలు ఇతరత్రా పనులను వైద్య ఆరోగ్య సిబ్బందికి కేటాయించారని, ఇదే పనిలో సతమతమై ఉన్న గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలను 'వారు చేసే పనేమీ లేదన్నట్లుగా' సదురు అధికారి మాట్లాడటం గర్హనీయం అన్నారు. హెల్త్ సెక్రటరీలను కించపరిచే వ్యాఖ్యలకు వ్యతిరేకంగాను, పెన్షన్లు పంపిణీ కార్యక్రమం నుండి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలను మినహాయించాలని కోరారు. అనంతరం డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.అన్నమ్మ, నాయకులు డి.విజయకుమారి, చంపవల్లరి, టి.నాగలక్ష్మి, సందాని, శాంతి పాల్గొన్నారు

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి - తాడికొండ

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రైతులకు ఎలాంటి కేటాయింపులు జరగలేదని మండల రైతు సంఘం నాయకులు చింతల భాస్కర్ రావు, కనగాల పూర్ణచంద్రరావు విమర్శించారు. సోమవారం తాడికొండ బస్టాండ్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి రైతాంగానికి తీవ్ర నిరాశ మిగిల్చారని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ రంగం సిద్ధం చేసుకున్నారని అన్నారు, కార్మిక కర్షక ఐక్యత ద్వారానే వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఇమ్మడి రామారావు బాణావత్ భద్రయ్య, జోజి, వెంకటేశ్వరరావు, పిచ్చిరెడ్డి, సిపిఐ రాజధాని ప్రాంత కార్యదర్శి ముప్పాళ శివ శంకర్, రైతులు పాల్గొన్నారు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు అన్యాయం జరిగిందని , ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సి.ఐ.టి.యు.మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు వ్యతిరేకంగా సి.ఐ.టి.యు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రమేష్ బాబు మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి ఇచ్చిన 15 వేల కోట్లు గ్రాంటుగా ఇవ్వకుండా ప్రపంచ బ్యాంక్ నుండి అప్పు ఇప్పిస్తామని చెప్పడం రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోనికి నెట్టడమేనని అన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి కూలీలకు అన్యాయం చేశారన్నారు. విశాఖ ఉక్కుని ప్రభుత్వ రంగంలో కొనసాగించేందుకు ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి కొత్తా వెంకట శివరావు మాట్లాడుతూ బడ్జెట్ రైతులకు నిరాశ కల్గించిందని అన్నారు. ఢిల్లీలో రైతుల సుదీర్ఘ ధర్నా సందర్భంగా ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలుజరపలేదని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జంపని రామారావు,దేవరకొండ శ్రీనివాసరావు, చుక్కా యానాదులు,నల్లమోతు రాజేంద్ర,ఫణిదపు భువనేశ్వరి, ఎస్ఎఫ్ఐ సభ్యులు ఎన్ వంశి. నాయక్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలో

పెదనందిపాడులో

తాడికొండ తహశీల్దార్‌గా నాసరయ్య

ప్రజాశక్తి - తాడికొండ

తాడికొండ మండల నూతన తహసీల్దార్ గా కె నాసరయ్య సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ రైతులు సమస్యలు సత్వరమే పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజలు ఎంటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, ఇంచార్జి ఆర్ఐ శర్మ, వీఆర్వోలు, మాల్యాద్రి, గోపి బ్రహ్మయ్య కార్యాలయ సిబ్బంది నూతన తహశీల్దార్‌కు శు భాకాంక్షలు తెలియజేశారు.

సబ్‌కలెక్టర్‌కు ఆరు అర్జీలు

ప్రజాశక్తి - తెనాలి

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆరు అర్జీలు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు, ఎంపిడివో పరిధిలోని అంశాలకు సంబంధించి రెండు, పోలీసు, మున్సిపల్ శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ చొప్పున దాఖలయ్యాయని, నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించేందుకు అర్జీలను సంబంధిత అధికారులకు పంపినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.

కేంద్రబడ్జెట్‌పై వర్సిటీలో సెమినార్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్ . శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో 2024- 25 కేంద్ర బడ్జెట్ పై సెమినార్ నిర్వహించారు. ప్రొఫెసర్ ఆర్ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో కేంద్ర బడ్జెట్ అత్యంత ప్రాముఖ్యత సంతరించు కుందని, ఆర్థిక అభివృద్ధి ఉపాధి, పెట్టుబడులకు, అంతర్జాతీయ వ్యాపారంలో చాలా ముందుకు వెళ్లేందుకు ఉపయోగ పడుతుందని అభివర్ణించారు. ద్రవ్యోల్బణం తగ్గటానికి వ్యాపార చక్రాలు అదుపులో పెట్టడానికి బడ్జెట్ లో 48 లక్షల కోట్ల వ్యయం దోహద కారిగా ఉంటుందన్నారు. ముఖ్య అతిధిగా ప్రొఫెసర్ సి.ఎస్.ఎన్.రాజు పాల్గొని ప్రసంగిస్తూ వివిధ రకాల లోటు బడ్జెట్ ల గురించి వివరిస్తూ దృవ్య లోటు 4.9 శతానికి తగ్గించడాన్ని మంచి పరిణామం గా చెప్పారు. ఎఫ్ఎంసిజి వస్తువులు, స్వల్ప దీర్ఘ కాల మూలధన, ఆదాయాలపై పన్నును సమర్ధించారు.

కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ విధానంలో నాన్ టీచింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యవర్గానికి అధ్యక్షునిగా కంకణాల వెంకట సుధీర్, కార్యదర్శిగా డాక్టర్ దొడ్డక శివరామకృష్ణ, కోశాధికారిగా లంకపల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా టి. సుబ్రమణ్యం, సయ్యద్ అనీషా బేగం, జాయింట్ సెక్రటరీస్ గా ఎం. శిరీష, జి. రజత, ఎల్. సౌమ్య కార్యవర్గ సభ్యులుగా యు .అన్నామని, జి. శాంతరాజు, ఏ. మణి, కే. కిషోర్, ఎం. అన్నపూర్ణాదేవి ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నట్లు ప్రకటించారు. కార్యవర్గానికి గౌరవ అధ్యక్షులుగా వికాస అధ్యక్షుడు టి. అనిల్ కుమార్, గౌరవ కార్యదర్శిగా వికాస కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, సలహాదారులుగా కనకరాజు, అజయ్ బాబు లను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు వెంకటసుధీర్ పేర్కొన్నారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన దరఖాస్తుల పరిశీలనపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలో ఇప్పటివరకూ అందిన దరఖాస్తుల పరిశీలన రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. ఇప్పటివరకూ జిల్లాలో అందిన 52,112 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించాలన్నారు. అనంతరం కమిటీ ద్వారా పథకానికి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. 18 రకాల వృత్తుల్లో నిమగ్నమైన వారికి నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక తోడ్పాటు కల్పించే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా వీలైనంత ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా చూడాలని చెప్పారు. సమీక్షలో జిల్లా పరిశ్రమల ఇన్‌ఛార్జి అధికారి సుధాకర్, ఎల్డీఎం రాంప్రసాద్, డీఆర్డీఎ పీడీ బాలునాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు, డీపీఆర్వో ఓంప్రకాశ్‌రెడ్డి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఫీజుల దోపిడీని ప్రభుత్వం నియంత్రించాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల్లో ఫీజుల దోపిడీతో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని, ఫీజుల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చట్టం చేయాలని కోరారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనునాయక్ అన్నారు. ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్ ఎన్.రవికుమార్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. విద్యా సామగ్రితోపాటు యూనిఫాం కూడా పాఠశాలలోనే తీసుకోవాలంటూ తల్లిదండ్రులను ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని, నిబంధనలు మీరుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బి.చిన్ననాయక్, డి.డేవిడ్, ఆర్.శ్రావణ్‌నాయక్ పాల్గొన్నారు.

ఒకటో తేదీన మాత్రమే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

సామాజిక పింఛను లబ్ధిదారులు ఎవరైనా వేరే గ్రామాల్లో ఉంటే వారు కచ్చితంగా ఒకటో తేదీన అందుబాటులో వుండాలని ఎంపీడీవో సరోజని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పింఛను పంపిణీ కార్యక్రమం 1వ తేదీన ఒక్కరోజు మాత్రమే జరుగుతుందని, లబ్ధిదారులు వారి గ్రామాల్లో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉదయం 5 గంటల నుండి పింఛను పంపిణీ ఉంటుందని తెలిపారు.

ఎస్పీ గ్రీవెన్స్‌లో ఆర్థిక మోసాలపై అధిక ఫిర్యాదులు

సమస్యలు వింటున్న పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్పందన కార్యక్రమంలో తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశగా వచ్చిన ప్రజలకు భరోసా నింపాల్సిన బాధ్యత పోలీసు ఉన్నతాధికారులపై ఉందని, దీనికి తగినట్టుగా పోలీసులు అంకితభావంతో పనిచేయాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

రషీద్ హత్యకేసులో పెద్దలపై కేసు పెట్టాలి

వైసిపి సానుభూతిపరుడు రషీద్‌ను హత్య చేసిన నిందుతులతో పాటు వెనకుండి నడిపించిన పెద్దలపై కేసు నమోదు చేయాలని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఈ మేరకు రషీద్ కుటుంబ సభ్యులతో కలిసి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. చెట్టు కొమ్మలనే ప్రస్తుతం నరుకుతున్నామని చెట్టునే నరికేయాలంటూ టిడిపి నేతలు మాట్లాడుతున్నారని తన హయాంలో వినుకొండ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, ఎటువంటి వివాదాలు తలెత్తకుండా పాలన అందించానని అన్నారు. రషీద్ తల్లి మాట్లాడుతూ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు కనీసం తమని పరామర్శించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ కుమారుడిని చంపిన నిందుతులను కఠినంగా శిక్షించాలన్నారు.

ఆస్తికోసం చెల్లెలు దౌర్జన్యం

అనారోగ్యంతో కంటి చూపు కోల్పోయి ఏ పనీ చేయలేకపోయిన నేపథ్యంలో భార్య ఉన్న కొద్దిపాటి పొలం సాగు చేస్తూ కూలి పనులకు వెళ్లి పిల్లల చదువుతో పాటు కుటుంబాన్ని పోషిస్తోందని ఈ నేపథ్యంలో గ్రామంలోనే ఉండే చెల్లెలనే కనికరం లేకుండా ఇంటిని 3 ఎకరాల పొలాన్ని ఆక్రమించి దౌర్జన్యం చేస్తోందని, దీనిపై రొంపిచర్ల పోలీస్ స్టేషన్లో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, విచారణ జరిపి న్యాయం చేయాలని రొంపిచర్ల మండలం మాచవరానికి చెందిన కేసరి శ్రీనివాసరెడ్డి తన చెల్లెలు గాయం అంజమ్మపై ఫిర్యాదు చేశారు.

పరిహారంగా ఇచ్చిన భూమిపై అక్రమార్కుల దౌర్జన్యం

తనకు వారసత్వంగా వచ్చిన పొలంలో కొన్నేళ్ల ఏళ్ల క్రితం ప్రత్యామ్నాయ మార్గం లేక ప్రభుత్వం తన పొలం గుండా రోడ్డు వేసిన సత్తెనపల్లి- దొడ్లేరు రోడ్డు మార్గం కింద తనకు చెందిన ఎకరం పొలం పోయిందని దీని కింద పరిహారంగా ఇచ్చిన 15 ఎకరాల వాగు పోరంబోకు భూమికి అప్పటి కలెక్టర్ పట్టా ఇచ్చారని 5 గురు సంతానం కాగా దీనిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని దీనికి సంబంధించి పూర్తి హక్కులు తనకు కల్పించాలని కొన్నేళ్ల నుండి రెవిన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని కొత్తగా మరో సమస్య ఎదురయిందని గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బాలస్వామి, ఎర్రబాబు, రాజా మరికొందరు ఆ భూమిని కాజేయలని చూస్తున్నారని అచ్చంపేట మండలం నిండుజర్లకు చెందిన మాదాసు పెద్ద వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో కలెక్టర్ కార్యాలయంలో అనేకమార్లు ఫిర్యాదు చేశానని, ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

కేసు నమోదు చేయడం లేదు

ఈ ఏడాది ఏప్రిల్ 24న కుటుంబంతో సహా విజయవాడ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాక 4 రోజుల తర్వాత గమనిస్తే బ్యాగ్‌లో ఉన్న 26 సవర్ల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని, కొంత నగదు మరికొంత బంగారం అలాగే ఉన్నాయని, దీనిపై దాచేపల్లిలో పోలీసులకు ఫిర్యాదు చేస్తే విజయవాడలో ఫిర్యాదు చేయాలని చెబుతున్నారని, విజయవాడ పోలీసులు మీ గ్రామ పరిధిలో గల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెబుతున్నారని, ఆభరణాలు పోయి 3 నెలలు అయిందని అనుమానితుల వివరాలు చెప్పినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదని దాచేపల్లి మండలం పెద్ద గార్లపాడుకు చెందిన చిరు వ్యాపారి వెచ్చా వెంకట నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

కెనడాకు పంపిస్తామంటూ మోసం..

తన సోదరుని ఉన్నత విద్యకై కెనడా పంపించేందుకు హైదరాబాద్ ఫ్లై హై కన్సల్టెన్సీ ఏజంట్ పిడుగురాళ్లకు చెందిన పాటిబండ్ల బ్రహ్మం ద్వారా రూ.7 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నామని, దీనికి సంబం ధించి రూ.3.50 లక్షలు చెల్లించా నని, అయితే తన సోదరుని కెనడా పంపించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఏడాది నుండి ఇబ్బంది పెడుతున్నాడని, దీనిపై పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని పిడుగు రాళ్ల పట్టణానికి చెందిన అబ్దుల్ ఖాదర్ ఫిర్యాదు చేశారు.

నాకు తెలియకుండానే నా పేరుతో రుణం..

వ్యాపార అవసరాల నిమిత్తం నరసరావుపేట ఐడిఎఫ్‌సి బ్యాంకులో రూ.50 వేలు రుణం తీసుకొని నెలకు రూ.6 వేలు చొప్పున 11 నెలలు పాటు రూ.66 వేలు చెల్లించానని, బ్యాంకులో తనకు లోను మంజూరు చేసేందుకు సహకరించిన అదే బ్యాంకు ఉద్యోగి అయిన దుద్దెల శివ రామకష్ణ తన పేరిట మొత్తం రూ .1.50 లక్షలు లోన్ మంజూరు చేయించి తనకు తెలియకుండా రూ.లక్ష కాజేశాడని తెలిసిందని, దీనికి సంబంధించి బ్యాంకు సిబ్బందిని సంప్రదించగా అతని సస్పెండ్ చేశారని అయితే బ్యాంక్ అధికారులు మాత్రం రుణం మొత్తం చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని నకరికల్లు మండలం రూపెనగుంటకు చెందిన కిరాణ దుకాణం నిర్వాహకురాలు పొట్టి సౌమ్య ఫిర్యాదు చేశారు.

మతం మారలేదని తల్లి వివక్ష

దుర్గి గ్రామానికి చెందిన తోట అమరలింగయ్య నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కాగా తల్లి పెద్ద కూతురు వేరే మతం పుచ్చుకున్నారని, తాము మతం పుచ్చుకోలేదని వివక్ష చూపుతూ వేధింపులకు పాల్పడుతుందని చిన్న కుమారై క్రిష్టినా, కుమారుడు పీటర్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం తన సోదరి బ్యూలారాణి ధర్మవరం గ్రామ సచివాలయంలో మహిళా కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ, చెల్లికి, తనకు వివాహం కానియకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. కుటుంబ పెద్దలు, బంధువులు, దాచేపల్లి పోలీసులు పరిష్కరించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని చెప్పారు.

పిల్లలకు వాహనాలిస్తే తల్లిదండ్రులపైనా కేసులు

ప్రజాశక్తి- పెదకూరపాడు

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, పిడుగురాళ్ల రవాణా శాఖ అధికారి సిహెచ్ రాంబాబు, ప్యానల్ న్యాయవాది దివ్వేల శ్రీనివాసరావు అన్నారు. మోటారు వాహనాల చట్టం గురించి మండలంలోని, పాటిబండ్లలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరక్కుండా వాహనదార్లు జాగ్రత్తలు పాటించాలని, ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే ప్రమాదాల బారిన పడటమే కాక ఒక్కోసారి ప్రాణాలు కూడ పోతున్నాయని హెచ్చరించారు. యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో తలకు ఎక్కువగా గాయం కావడం వల్ల చనిపోతున్నారని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 25-35 ఏళ్లలోపు వారే ఎక్కువగా చనిపోతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించకపోవడం నేరమన్నారు. జులై 1 నుండి దేశంలో క్రొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని, అంతేకాకుండా మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులకు, తలిదండ్రులు కూడా శిక్షలు పడే విధంగా నూతన చట్టాలు ఉన్నాయని వివరించారు. ప్రతి ఒక్క వాహన దారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. వాహనానికి ఇన్స్యూరెన్స్ చెల్లించాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ చదువుతో సంబంధం లేకుండా డ్రైవింగ్ లైసెన్సులు పొందాలన్నారు. కార్యక్రమంలో లీగల్ వాలంటీర్ షేక్ సుభాని, పెదకూరపాడు పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ రమేష్, పాటిబండ్ల మహిళా పోలీస్ కె.పూర్ణిమ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రమణనాయక్

అతిసార నివారణపై అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

అతిసార నివారణపై మండలంలోని ఏనుగుపాలెం ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రమణ నాయక్ మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారం తీసుకునే ముందు సబ్బుతో చేతును శుభ్రంగా కడగాలని చెప్పారు. టాయిలెట్ కు వెళ్లి వచ్చిన తర్వాత చేతులు పరిశుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తీసుకోకూడదని, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. అతి సార వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని అన్నారు. పాఠశాలలో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జె.ఎలీషా, స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయిచందు, ఎఎన్‌ఎం దేవిక, అంగన్వాడీ వర్కర్స్ కస్తూరి, యేసు నిత్య, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

పూర్వ భవనంలోకి జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయనకేంద్రం కార్యాలయాన్ని గతంలో ఉన్న భవనంలోకి మార్చినందుకు యూనివర్సిటీ ఉన్నతాధికారులకు జగ్జీవన్ రామ్ అధ్యయనకేంద్రం అధికారి, ఎంఎస్ఎఫ్ నాయకులు, పరిశోధకులు, విద్యార్థులు సోమవారం బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే. రత్నాకర్ నేతత్వంలో వీసీ ఆచార్య కె .గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె .రత్నషీలామణి. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య ఏ. వెంకటేశ్వర్లును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే. రత్నాకర్, ఎంఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఏఎన్‌యూలో బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రాన్ని 2018లో యూనివర్సిటీలోని పాత ఎస్ బి ఐ భవనంలో అధికారికంగా ప్రారంభించారని, ఆ భవనంలో అన్ని వసతులు ఉన్నప్పటికీ 2019 చివర్లో యూనివర్సిటీలో బాధ్యతలు తీసుకున్న యూనివర్సిటీ ఉ న్నతాధికారులు, అధ్యయన కేంద్రం అధికారులు కలిసి ఉద్దేశపూర్వకంగా ఇతర ప్రాంతానికి మార్చడంతోపాటు ఆ కేంద్రాన్ని నిర్వీర్యం చేశారన్నారు. అధ్యయనకేంద్రంలో ఉన్న సమస్యలు తెలిపిన వెంటనే యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి మరలా పాత

భవనంలోకి అధ్యయన కేంద్రాన్ని మార్పించడం అభినందనీయమన్నారు. ఉన్నతాధికారుల సహకారంతో త్వరలో జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సదస్సులు, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉన్నతాధికారులను కలిసిన వారిలో డాక్టర్ సీహెచ్ ఇజ్రాయేల్, డాక్టర్ ఎస్ .రాజశేఖర్, వై .రాజేష్, సునీల్, శ్రీను, అలీభాషా, దిలీప్, నరేంద్ర, సాల్మన్, రాజు, బద్రి, ఆదామ్, జకరయ్య, ఎన్. ఎజ్రా తదితరులు ఉన్నారు.

పాఠశాలకు ప్యూరిఫైయర్ వాటర్ అందచేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఉడతా శ్యామసుందరరావు మెమోరియల్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఇందిరానగర్ ఎంటీఎంసీ పాఠశాలలో విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు స్థానిక వుడతా శ్యామసుందరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వాటర్ ప్యూరిఫైర్ అందజేశారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఎన్ బాబురావు హాజరై వాటర్ ప్యూరిఫైర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు తాగటం వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని, పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ట్రస్ట్ చైర్మన్ వుడతా శ్రీనివాసరావు వాటర్ ప్యూరిఫైర్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ పీ వెంకట్ సిద్ధాంతి, హెచ్ఎం సైదా నాయక్, టీడీపీ నాయకులు అన్నం నాగబాబు, జొన్నాదల వెంకట రమణ, గొట్టిముక్కల సుబ్బారావు పాల్గొన్నారు.

చేనేత సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు తక్షణమే పాలకవర్గ ఎన్నికల నిర్వహిం చాలని, ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం మంగళగిరి పట్నంలోని రాష్ట్ర హ్యాండ్లూమ్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ కన్నా బాబుకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జొన్నాదుల భారతి, రాష్ట్ర కోశాధికారి

డిప్యూటీ డైరెక్టర్ కన్నా బాబుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బత్తూరి మోహన్ రావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకటకష్ణ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బత్తుల గిరి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడారు. చేనేత పై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి వృత్తి పరికరాలను సబ్సిడీతో పంపిణీ చేయాలని, 11 రకాల చేనేత వస్త్ర ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి, వస్త్ర ఉత్పత్తులకు ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలి, జౌళి శాఖ నుండి చేనేతను విడదీసి చేనేత పరిశ్రమను కాపాడాలి, చేనేతకు రాష్ట్ర బడ్జెట్లో రూ.1000 కోట్లు కేటాయించాలి చేనేత కార్మికులకు మూడు సెట్ల స్థలం ఇచ్చి పక్కా ఇల్లు వర్క్ షెడ్లు ప్రభుత్వమే ఉచితంగా నిర్మించే ఇవ్వాలి తదితర సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై సర్వే

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీ హెచ్సీ పరిధిలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇందిరా నగర్ యూపీహెచ్సీ ఆధ్వర్యంలో ఈనెల 18 వ తేదీ నుండి ఆగస్టు రెండో తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం కొనసాగుతుంది. యూపీహెచ్సీ పరిధిలో ఏఎన్ఎం లు, ఆశాలు ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గాయత్రీ నగర్ లో జరుగుతున్న సర్వేను సోమవారం హెల్త్ సెంటర్ మెడికల్

ఆఫీసర్ డాక్టర్ పీ అనూష, డీపీఎంఓ దాసరి జోసఫ్ పరిశీలించారు. అనంతరం డాక్టర్ అనూష మాట్లాడుతూ చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని మచ్చలు, ఎర్రని రాగి రంగు మచ్చలు, కనుబొమ్మలు కనురెప్పల వెంట్రుకలు రాలి పోవడం తో పాటు కనురెప్పలు పూర్తిగా మూయ లేక పోవడం, అరిచేతులు, కాళ్లు పాదాలు స్పర్శ లేకపోవడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. కుష్టు వ్యాధిని అశ్రద్ధ చేయడం వలన అంగవైకల్యంగా మారుతుందన్నారు. ప్రథమ దశలోనే మందుల ద్వారా అరికట్టి అంగవైకల్యం నుండి బయటపడవచ్చన్నారు. కుష్టు వ్యాధి గురించి భయ పడాల్సిన అవసరం లేదన్నారు. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగు తుందన్నారు. కుష్టు వ్యాధి సర్వేలో భాగంగా ఇంటింటికి వస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ప్రజలు సహ కరించాలని డాక్టర్ అనూష కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సూపర్వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆళ్ళను సత్కరిస్తున్న జడ్పీ చైర్మన్ క్రిష్టీనా, సురేష్ కుమార్

కవి సమ్మేళనంలో ఆళ్లకు సత్కారం

ప్రజాశక్తి - తెనాలి

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా స్థానిక కొత్తపేట లోని ఎన్జీవో కళ్యాణ మండపంలో దుగ్గిరాలకు చెందిన పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో పట్టణానికి చెందిన కవి ఆళ్ళ నాగేశ్వరరావు సత్కారం పొందారు. 'జాషువాకు అక్షర హారతి' శీర్షికన ఆళ్ళ స్వీయకవితను వినిపించారు. ఈ సందర్భంగా ఆళ్ళ నాగేశ్వరరావు ను ముఖ్య అతిథులుగా విచ్చేసిన గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ కత్తెర హనీ క్రిష్టీనా, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి కత్తెర సురేష్ కుమార్ దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పెద్దేటి యోహాను, గౌరవాధ్యక్షులు డా. కొత్తపల్లి రాజ్ కుమార్, ప్రముఖ కవులు డా. రంగిశెట్టి రమేష్, పాతూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జండర్ సెన్సిటైజేషన్‌పై కెఎల్‌యులో అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

సమాజంలో సమానత్వం, గౌరవాన్ని పెంపొందించడంలో జెండర్ సెన్సిటైజేషన్ ఒక కీలకమైన ప్రయత్నమని గుంటూరుకు చెందిన ఆతుకూరి వెంకటలక్ష్మీ ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ ఎ.వీర రాఘవరావు అన్నారు. కెఎల్ డీమ్డ్ యూని వర్శి టీలోని సన్ ఫ్లవర్ హాలులో కెఎల్ ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ అద్వర్యంలో స్పహాప్తి పౌండేషన్ సహకారంతో సోమవారం నిర్వహించిన జెండర్ సెన్సిటైజేషన్ అనే అవగాహనా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన విద్యార్థి నులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు, పాత్రల సంక్లిష్టతలను గురించి వ్యక్తులకు అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో ఎప్పటినుండో పాతుకుపోయిన మూస పద్ధతులకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. ఆడ మగ అనే భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ గౌరవంగా, న్యాయంగా వ్యవహరించే వాతావరణాన్ని ప్రోత్సహించాలన్నారు. లింగ పక్షపాతాల గురించి సంభాషణలలో చురుకుగా పాల్గొనడం, అందరినీ కలుపుకొని ఉన్న అభ్యాసాల కోసం

డాక్టర్ ఎ.రాఘవరావును సత్కరిస్తున్న డాక్టర్ కె.రూత్ రమ్య తదితరులు

వాదించడం ద్వారా, తాము వివక్షతతో కూడిన నిబంధనలను తొలగించి, సమానమైన సమాజాన్ని సృష్టించగలమని దీమా వ్యక్తం చేశారు. లింగ సున్నితత్వాన్ని స్వీకరించడం అనేది వ్యక్తులను శక్తివంతం చేయడమే కాకుండా మన సమాజాన్ని బలోపేతం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కెఎల్ వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, విసి డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖర రావు, డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విధ్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్, ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య, కో కన్వీనర్ ఎన్.శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ అంబేద్కర్, సావిత్రీభాయ్ పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బృందం

బిటిఎ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-తెనాలి

బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ)ఆవిర్భావ దినోత్సవం సోమవారం స్థానిక కొత్తపేట ఎన్జీవో కల్యాణ మండపంలో నిర్వహించారు. బిటిఎ రాష్ట్ర కార్యదర్శి బట్టు వెంకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆల్ ఇండియా అడిషనల్ కార్యదర్శి గడ్డ ఏలియా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి బిటిఎ అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీభాయ్ పూలే చిత్రపటాలకు అసోసియేషన్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.మధు, జి.వేమయ్య, పి.బాలాజి, సిహెచ్ కిషోర్‌బాబు, కె.హీరమ్స్, ఎన్.సురేష్‌బాబు, డి.ప్రకాశరావు, కిరణ్‌కుమార్, టి.జయపాల్, కె.రమేష్ పాల్గొన్నారు.

తాడేపల్లి జడ్‌పి పాఠశాలలో ప్రత్యేక భోజనాలు

ప్రజాశక్తి-తాడేపల్లి :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఏర్పాటు చేసిన నూతన విద్యా విధానం శిక్ష సప్తాహ్‌ను పురస్కరించుకుని తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, నులకపేట ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేకంగా భోజనాలు సోమ వారం ఏర్పాటు చేశారు. ముందుగా పాఠశాల ఫౌండర్ దొంతిరెడ్డి అంజిరెడ్డి పేరు మీద విద్యార్థులకు స్వీటు, హాటు నిమిత్తం రూ.10 వేలు మాజీ ఎంపిపి దొంతిరెడ్డి వేమారెడ్డి అందజేశారు. నులకపేట ఉర్దూ పాఠశాలలో తిధి భోజన్‌కు షేక్ అనిఫ్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి మాట్లాడారు. అంజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళగిరిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే నిరాహార దీక్షలు నిర్వాహకులు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు , ప్రముఖ న్యాయవాది గుర్రం రామారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 256 స్కూల్స్ నందు 50 వేలమంది దళిత గిరిజన విద్యార్థులు ,చదువుకుంటున్నారని ఈ పథకాన్ని గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. ఈ పథకం రద్దు వలన పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన ఈ పథకాన్ని అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పేదలకు విద్యను దూరం చేయొద్దని విన్నవించారు. మూడవ రోజు రిలే నిరాహార దీక్షలో గుర్రం రామారావు, మదనపల్లి , చిత్తూరు కోనసీమ అమలాపురం జిల్లాల నుండి బొంతు రవికుమార్, కుసుమ, గౌరి, కుంచె రమేష్ ,బాలకష్ణ ,జి ధనరాజ్, ఎన్ శంముగం, శ్రీనివాసులు, జమున, శైలజ సాక్షి సంజన ,కే శ్రావ్య, సత్య బాబు తదితరులు ఈ రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలియజేశారు.

1న నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయాలి

లబ్ధిదారులకు ముందస్తు సమాచారం ఇవ్వండి

అధికారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలోని పింఛనుదారులందరికీ ఆగస్ట్ 1వ తేదీనే 100 శాతం పింఛన్లు పంపిణీ కావాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు 2 వ తేదీన పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లో పింఛన్ల పంపిణీపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,2 తేదీల్లో మొత్తం పింఛన్లు పంపిణీ కావాలని, ఈ విషయాన్ని ప్రతి గ్రామం, వార్డులో ముందస్తు ప్రచారం చేపట్టాలని అన్నారు. పింఛను డబ్బులను ఈ నెల 31న డ్రా చేసి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఆగస్ట్ 1వ తేదీ ఉదయం 5.00గం.ల నుంచి పింఛన్లు పంపిణీ కావాలని కలెక్టం చెప్పారు. అధిక శాతం పింఛనుదారులు ఒకే బ్యాంకు నుంచి పింఛను పొందడం వలన, పింఛను పొందడంలో కాస్త జాప్యం జరిగే అవకాశం ఉందని, అటువంటి సమస్య లేకుండా తమ సమీప బ్యాంకు నుంచి లబ్ధిదారులు పింఛనును పొందేలా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మండల ప్రత్యేక అధికారులు పెన్షన్ పంపిణీలో పాల్గొనాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డి.ఎల్.డి.ఓ , ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రేరణ పౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ప్రిజర్వింగ్ స్టూడెంట్స్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో గుంటూరు, 41వ డివిజన్‌లోని ఎంవిఎస్ హైస్కూల్లో విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రేరణ ఫౌండేషన్ ఫౌండర్ శరత్ సుదర్శి మాట్లాడుతూ పేదపిల్లలు చాలా మంది పోషకాహార లోపంతో, రక్తహీనతతో బాధపడుతున్నారని, సరైన సమయంలో ఈ సమస్య గుర్తించకపోతే అనేక అనారోగ్యాలు వచ్చే అవకాశం వుందన్నారు. అందుకే పిల్లల్లో ఉన్న అనారోగ్య సమస్యలు తెలుసుకునేందుకు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రేరణ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటువంటి క్యాంపులు రెండు తెలుగు రాష్ట్రాలలోని బస్తీల్లో, మురికి వాడల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రిజర్వింగ్ స్టూడెంట్స్ హెల్త్ ఫౌండేషన్ ఫౌండర్, సీఈవో ఆర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ మన దేశంలో చాలా మంది పిల్లలు అనేక ఆరోగ్య సమస్య వల్ల చదువుకు దూరమవుతున్నారని, రక్త పరీక్షల ద్వారా ఆయా సమస్యను ముందే గుర్తిస్తే జాగ్రత్తగా వుండొచ్చని చెప్పారు.కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్స్ శ్రీనివాస్ తిరుమలసెట్టి, సుజాత తిరుమలసెట్టి, ప్రిన్సిపాల్ తాండవకృష్ణ, స్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఎల్.ఎస్.భారవి, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, ప్రేరణ సభ్యులు సుభ్దిన్ రాజు, అరుణ, శరత్, శ్రీకాంత్, హుస్సేన్ పాల్గొన్నారు.

పశువులు రోడ్లపైకి రాకుండా చూడాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

సమాజంలో జంతువుల పట్ల క్రూరత్వ నివారణ (ఎస్.పి.సి.ఏ) చర్యలపై సంబం ధిత శాఖల జిల్లా అధికారులతో సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి జిల్లా కోర్టులోని తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. రోడ్ల పైన ఆవులు తిరుగుతున్నాయని, వాటి వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యని, దీనిపై ప్రజల నుండి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రోడ్లపై ఆవులు తిరగకుండా ఏ విధమైన చర్యలు చేపడుతున్నారని మున్సిపల్ శాఖాధికారులను ప్రశ్నించారు. ఆవులను వెంగళాయపాలెంలోని గోశాలకు తరలించడం జరుగుతున్నదని , వాటి యజమానులు వచ్చినప్పుడు రిజిస్టర్‌లో ఫోటోతో కూడిన వివరాలు నమోదు చేసుకొని, ఆవులను వారికి అప్పగించడం జరుగుతుందన్నారు. అవుల ఆరోగ్య సమస్యలు, అక్రమ రవాణ నివారణకు చేపడుతున్న చర్యలు వివరించారు. యజమానులు రోడ్లపైకి పశువులను వదలకుండా చూడాలని ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు. సొసైటి ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమాల్స్ (ఎస్.పి.సి.ఏ) కమిటీ సభ్యులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని పశువుల అక్రమ రవాణా , రోడ్లపై పశువులు సంచరించినా , మరేమైనా సంఘటనలు జరిగిన సమాచారాన్ని గ్రూప్ ద్వారా తెలియజేసుకోవాలన్నారు. వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయవలసిందిగా డిఎల్ఎస్ఏ సెక్రెటరీకి సూచించారు. కోర్టు ప్రాంగణంలో కుక్కల బెడద ఎక్కువగా వుందని , కుక్కల వలన మనుషులకు ప్రమాదం కలగకుండా తీసుకోవలసిన చర్యల గురించి అధికారులతో సమీక్షిం చారు. కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ సెక్రెటరీ లీలావతి , ఏ.డి జిల్లా పశుసంవర్ధక శాఖ డాక్టర్ మోహన్ రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 220 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, డిఆర్ఓ పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీఖర్, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 220 అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదులను సకలంలో పరిష్కరించి అవి రీఓపెన్ కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి ఉమాదేవి, డియం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి , సిపిఓ శేషశ్రీ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

గుంటూరు నగరంలోని పలు సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ఎస్సీ కాలేజి బాయ్స్ హాస్టల్‌లో ఫ్యాన్లు లేవన్నారు. ఎస్సీ స్కూల్ హాస్టల్‌లో మరుగుదొడ్లు సరిపడా లేవన్నారు. మెషలు లేకపోవటం వల్ల దోమలు కుడుతున్నాయన్నారు. బిసి కాలేజి గరల్స్ హాస్టల్‌లో సరిపడా వర్కర్లు లేరన్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేవన్నారు. స్టాల్ గరల్స్ ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లలో లైట్లు లేకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని, హాస్టల్ విద్యార్థులకు అడ్మిషన్లు అందరికీ ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.సమీర్, సహాయ కార్యదర్శులు పవన్, యశ్వంత్ పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

దివ్యాంగులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్పందనలో అర్జీ అందచేశారు. దివ్యాంగులు విమానాలు, శస్త్ర చికిత్సలు సరైన పద్దతిలో చేయగలరా అని, తగు సామర్థ్యం లేని వారిని ఆలిండియా సర్వీసుల్లో ఎలా తీసుకుంటారని ఎక్స్‌లో పోస్ట్ చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడటం అంటే రాజ్యాంగాన్ని అవమానించినట్లేనని అన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన లేకుండా మాట్లాడటం బాధాకరం అన్నారు. కావున ఆమెపై తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.కిరణ్, జి.లక్ష్మణచౌదరి, శ్రీనివాసరావు, రాంబాబు, సరేంద్ర, లక్ష్మయ్య పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయలు కల్పించాలి

అడవి తక్కెళ్లపాడు వద్ద టిడ్కో గృహాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని లబ్దిదారులు అర్జీ అందచేశారు. ఇళ్లు ఇచ్చి ఆరు నెలలు అవుతున్నా ఇంత వరకూ నీరు, కరెంటు, శానిటరీ, వీధిలైట్లు, రోడ్ల సమస్యలతో బాధపడుతున్నామని చెప్పారు. పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి విషపురుగులు తిరుగుతున్నాయని, త్రాగునీరు సక్రమంగా రావట్లేదని, వచ్చేవి కూడా మురుగునీరు వస్తుందన్నారు. వర్షపునీరు నిలిచి దోమలు పెరుగుతున్నాయన్నారు. కావున ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారలో డి.జార్జి, పి.శంకర్, షేక్. మీరాసాహెబ్, జి.శేఖర్, డి.కుమారి తదితరులున్నారు.

అంధులకు ఉద్యోగ నియామకపత్రాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్పెషల్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో భాగంగా ముగ్గురు విజువల్లీ హ్యాండీక్యాప్డ్ అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి నియామక ఉత్తర్వులు అందిం చారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నెమలికంటి పవిత్రకు ల్యాబ్ అసిస్టెంట్‌గా జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం , దొప్పలపూడి వినోద్ కుమార్‌కు శానిటరి మేస్త్రీగా పొన్నూరు మున్సిపల్ కార్యాలయం, చిట్టిబొమ్మ కనకారావుకు ఆఫీసు సబార్డినేట్‌గా జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో నియమించారు. కార్యక్రమంలో డిఆర్ఓ పెద్ది రోజా, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవద్దుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త పాల్గొన్నారు.

రేపు ఎంబిటిఎస్ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-గుంటూరు

నల్లపాడులోని ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజిలో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ విధానంలో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ టి.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పాలీసెట్ రాయకపోయినా స్పాట్ అడ్మిషన్ కోసం హాజరు కావచ్చని తెలిపారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సులలో తక్షణ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కావున ఆసక్తి ఉన్న వారు ఈనెల 31వ తేదీన ఉదయం 10 గంటలకు, టెన్త్ మార్కుల జాబితా, 4వ తరగతి నుండి 10వ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణపత్రం, టిసి, ఇడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు ఒరిజినల్స్‌తోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా సీటు పొందిన వారు దాదాపు రూ.6500ల ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అర్జీల స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్

జిఎంసి గ్రీవెన్స్‌లో 24 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్, ఎస్.ఈ. శ్యామ్ సుందర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో విభాగాధిపతులతో కలిసి ఇంచార్జి కమిషనర్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 4, ఇంజినీరింగ్ విభాగం 6, రెవెన్యూ విభాగం 3, ప్రజారోగ్య విభాగం 4, అకౌంట్స్ విభాగం 3, ఉపా సెల్ 2, ఎన్నికల విభాగానికి సంబందించి 1, జిఎస్డబ్ల్యు 1 ఫిర్యాదు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకట లక్ష్మి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, డి.సి.పి.లు, ఏసిపిలు, ఈఈలు, ఆర్ఓ లు, సూపరిండెంట్లు పాల్గొన్నారు.